మినీ కథ

# గుర్తు

కావ్యావిష్కరణ మహోత్సవం జరుగుతోంది. కవి వుత్సాహంతో వూగిపోతూ తన 'సామాన్యుడి శపథం' నించీ కొన్ని కవితలు వినిపిస్తున్నాడు. కవిత్వం చాలా ఉద్రేకంగా నడిచింది. ఆయన గొప్ప కవిగా ఆంధ్ర దేశంలో పేరు మోసినవాడు. బిరుదులూ, సన్మానాలూ, అందుకున్నాడు. కనుక జనం యెక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కవి తన కవితా ప్రతిభతో, తన చదివే పద్ధతితో తనకిదివరకే వున్న కీర్తితో జనాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

అందంగా అలంకరించబడిన వేదిక మీద వేయబడిన మూడు మెత్తని కుర్చీల్లో రెండు ఆక్రమించబడి వున్నాయి. అందులో వున్నవారు కుడి నించీ యెడమకు (రేపు పత్రికల్లో ఇలాగే వస్తుంది) కృతిభర్త శ్రీ కృష్ణంరాజుగారు (ఫలానా శాఖమంత్రిగారు) స్థానిక యెమ్మెల్యే స్వామి నాయుడుగారు. వీళ్ళిద్దర్నీ గురించీ కవి యింతకుముందు తనకున్న పరిచయం ద్వారా వివరించాడు. తన 'సామాన్యుడిశపథం' కావ్యానికి మంత్రి కృష్ణంరాజుగారిని సరైన భర్తగా ఎంచుకోడాని క్కారణం,ఆయన సాహిత్య పిపాస అన్నారు. అంతేకాదు సామాన్యుడి శ్రేయస్సుకోసం తహతహపడుతున్న మా ఇద్దరి లక్ష్యమూ వొక్కటే! 'ఇదే ఇదే మన యిద్దరి పథం. ఇదే ఇదే సామాన్యుడి శపథం' అని అంకితం పేరవున్న కవిత చదివాడు.

తన కలం, గగనాన్నీ, భూమినీ కలిపి వర్గాల్లేని స్వర్గం నిర్మిస్తుందని వొక కవిత! కాంతి ద్వారాలు తెరిచాను, రండి మీరంతా నా వెంట! అని ఆర్డర్ జారీ చేస్తూ వొక్కవిత! తన కవిత్వం పేదవాడికంకితమనీ, తన కలంహాలం కష్టపడి సాహిత్య పొలాన్ని దున్ని పండించిన అక్షరాల మెతుకులన్నీ ఆకలి కడుపులకే అందిస్తానన్నదొకటీ! ఈ ఆఖరి కవిత జనాన్ని చాలా కదిలించినట్లుంది అర నిమిషం పాటు చప్పట్లు మోగాయి.

కవి చిరునవ్వులు చిందిస్తూనే, కొంచెంగా తలవంచి తన వినమ్రతను తెలియజేస్తోన్నాడు కవిత్వం నాకూ నచ్చింది. చప్పట్లు కొట్టడానికి మాత్రం చేతులు కదల్లేదు, యెందుకో బిగుసుకుంటున్నాయి. కళ్లు తెరుచుకుని సూటిగ్గా కవిని చూస్తోన్నాను. ఇదే దృశ్యం ఇంతకు ముందెన్నడో చూసినట్లు జ్ఞాపకం! ఈ బార్ లైట్ వెలుగులాగే ఫెళ్ళున కాస్తోన్న యెండ. పలకా, పుస్తకం వున్న సంచీ భుజాన తగిలించుకుని బడికిపోతూ పోతూ బురుజుకాడ... అవునవును! ఖాళీ సంచిలోంచీ పిల్లవాన్ని జుట్టు పట్టుకుని బైటికిలాగాడు. పెద్ద బండరాయిని ఒక్కగుద్దుకు వక్కలు చేశాడు. చొక్కా, నిక్కరు జేబుల్నించీ డబ్బులు రాల్చాడు, గలగలా. పిల్లవాని గొంతుకోసేసి మళ్ళా అతికించి అప్పుడూ చూస్తోన్న జనం ఇప్పట్లాగే చప్పట్లు కొట్టారు. అప్పుడతను యీ కవిలాగే గర్వంగానవ్వుతూ, తలవంచాడు. అప్పుడూ తన చేతులు యిప్పట్లాగే బిగుసుకున్నాయి.

'సాలు శీర్షిక'